# 14. సంఘర్షణ

వేసవి ఎండ మండి పోతుంది.

ఎర్ర ధూళి పొగలా లేచి, వూర్ని కప్పేస్తోంది. ఆ గుడిసెలు కావేసినట్లు గుబులుగా వున్నాయ్. జనం చెమటతో తడిసి తడిసి, రావకోవెల ముందు వేపచెట్టు కింద చేరారు. రావుడు తాత, వేపచెట్టు కింద నున్న రాతి పలక మీద చెట్టు మొదలకు నడుం ఆన్చి, కూర్చున్నాడు. సగం కాల్చి వుంచిన చుట్టను,తలపాగాలోంచి తీసి ముట్టించాడు. మూడు దమ్ములు లాగి ఆర్పేసి, తల పాగాలో మళ్లీ దాచాడు.

వయసు మళ్లిన కొందరు, ఆ గుడి అరుగుల మీద నిద్రపోతున్నారు. కొందరు కూర్చుని కబుర్లు చెప్పుగుంటున్నారు. ఇళ్ల ముంజూర్లు కింద కూర్చుని, కొందరు ఆడవాళ్లు పేలు నొక్కుకుంటూ, వూసులాడుకుంటున్నారు. కొందరు వయసులోని కుర్రాళ్లు, వయసులో వున్న ఆడపిల్లల్తో ఎకసెక్కేలాడుతున్నారు. గుడి వెనక కొందరు కుర్రాళ్లు గోళీలాడుతున్నారు. ఆ గుడికి ఎదురుగా, కొంచెం పక్కగా, సుబ్బారావు, మేడ వుంది. ఆ మేడ దూరం నుంచి చూస్తే, కిరీటంవున్న మారాజులా కనబడుతుంది. దగ్గర్నుంచి చూస్తే, ఆమేడ అందరికీ ఒహలా కనబడదు.

కొందరికి దేవేంద్ర భవనంలా కనబడుతుంది. కొందరికి చీకటి గుహలా, భయంకరంగా కనబడుతుంది.

ఆ వూరికీ - మేడకీ మధ్య, చీకటి గీతలా, ప్రహరీ గోడ వుంది.

ఆ గోడకి అవతల మామిడి తోట వుంది. ఆ చెట్ల కింద చిక్కని నీడలున్నాయి. ఆ నీడల్లో సుబ్బారావు మనవడు గిరిజారావు, మూడు చక్రాల సైకిలు మీద ఖుషీగా కూర్చున్నాడు.

రావుడు తాత మనవడు, రామారావు హుషారుగా సైకిలు తోస్తున్నాడు.

అప్పుడే సుబ్బారావు కార్లో ఇంటి ముందు దిగాడు. ఆ చిక్కని నీడల్లో ఆడుకుంటున్న మనవణ్ని హుందాగా చూసాడు. .అలా చూసి, హుందాగా మేడమీదకు వెళ్లాడు.

* * *

సుబ్బారావు పదిహేనేళ్లు వొచ్చే వరకూ, రావుడితో కలిసి, పక్కూరి నాయుడిగారి పశువుల్ని కాసాడు. ఆ తర్వాత పట్నం వెళ్లిపోయాడు. అక్కడ సారా కొట్లో పని సంపాదించాడు. కొంత కాలం తర్వాత తిరిగి ఆ వూరు వచ్చేసాడు. అప్పుడు ఆ వూళ్లో సొంతంగా

సారా కొట్టు పెట్టాడు.

సారా గ్లాసులు అందించడానికి, గల గల చప్పుడుచేసే గాజుల చేతులు అవుసరమని పట్నంలో సుబ్బు తెల్సుగున్నాడు. అంచాత ఆ సారాకొట్లో వొక చిన్న దాన్ని వుంచాడు. ఆ చిన్నది సుబ్బు కంటే పెద్దది. ఆమె పట్నం సారాకొట్లో పని చేసింది. చదువుకున్న వాళ్లు ఆమెను, గజ్జల సంగీతం అని పిల్చేవారు. చదువుకోని వాళ్లు ఆమెను ఎలా పిలిచేవాళ్లో చెప్తే, ఆమె సారాగ్లాసు మొహాన్ని విసిరికొడ్తుంది. సారా తాగని సుబ్బు, ఆమెను తాగుతూ వుండేవాడు.

అలా సుబ్బు - డబ్బుతో పెరగడం మొదలెట్టాడు.

ఆ తర్వాత సారా కొట్టు ముందు, టీ కొట్టు పెట్టాడు. టీ కొట్లో, గాజుల చప్పుళ్లకి బదులుగా, గజ్జల గల గలలు ఏర్పాటు చేసాడు.

అలా బాగా నిలదొక్కుకుని డబ్బు బాగా సంపాదించాడు. చిన్న చిన్న ఆస్తులు కొనడం మొదలెట్టాడు.

అలా కాలం గడుస్తోంది.

ఓ సారి ఆ వూరు గారడీవాళ్లు వచ్చారు. వాళ్లల్లో ఒక గడసాని వుంది. ఆమె ఫీట్సు చేస్తూ, బాణంలా వెనక్కి వంగినప్పుడు, సుబ్బు కళ్లు చెదిరిపోయాయి. వెంటనే ఆమెను సారాకొట్టుకు తీసుకు వెళ్లాడు. సారా బాగా పట్టించాడు. ఆ తర్వాత వెంటనే ఆమెను కొనేసి, ఆ సారా కొట్లో వుంచాడు.

అయితే-ఆమె శృంగార సాహిత్యానికి శృంగార సాహిత్యం చెప్పగలదని తెల్సుగున్నాడు. అంచాత పట్నంలో ఇల్లుకొని, విశ్రాంతి భవనం పెట్టాడు. అందులో-విశ్రాంతే గాకుండా-సుఖాలు అమ్మించడం మొదలెట్టాడు.

ఆ తర్వాత – వడ్డీవ్యాపారం - తాకట్టు వ్యాపారం మొదలెట్టాడు.

సారా కొట్టు నడిపాడు.

టీ కొట్టు నడిపాడు.

సుఖాలు అమ్మించాడు.

వడ్డీ వ్యాపారం - తాకట్టు వ్యాపారం - చేసాడు.

పొలాలు కొన్నాడు.

మేడలు కట్టించాడు.

అతడు అలా ఆస్తులు సంపాదించాడు. ఆ తర్వాత, సుబ్బారావుగా మారిపోయాడు, అలాంటి సుబ్బారావుని, రాజకీయాల్లోకి రమ్మనమని ఎన్నో పక్షాలు పిల్చాయ్.

అప్పుడతడు ఏ పార్టీ వల్ల తనకు లాభం వుంటుందో ఆ పార్టీలో చేరిపోయాడు.

ఎందరో ఎన్నో పార్టీలు మార్తారు! అయితే-సుబ్బారావు ఎప్పుడూ ఒకే పార్టీలో వున్నాడు! ఆ పార్టీ పేరు రూలింగు పార్టీ!

* * *

అయితే-రావుడి జీవితం వేరు.

అతడు ఇరవై ఏళ్లు దాటేవరకూ పక్కూరి నాయుడిగారి పశువుల్ని కాస్తూ వుండేవాడు.

అప్పుడు తండ్రి మిగిల్చిన పఱ్ఱ భూమిని సాగులోకి తేడానికి ప్రారంభించాడు. ఆ బూవి మూడెకరాలుంటుంది.

అందులో కొంత బూవి, బండరాళ్లతో నిండి వుంది. కొండ మీంచి పారే వర్షం నీరు, ఆ రాళ్ల మధ్యపారుతుంది. ఆ పక్కనే వున్న చిట్టడవి ఆ బూవి వేపు కూడా వ్యాపించి వుంది.

ఆ బూవిలో ఎండిపోయిన చెట్లు, బాగా ఎండిపోయి, భయంకరంగా వున్నాయ్. బాగా బలిసి పచ్చగా వున్న చెట్లు, కత్తులు దూస్తున్నట్లు క్రూరంగా వున్నాయ్. గజిబిజిగా చిక్కగా అల్లుకున్న ముళ్ల పొదలు, జుత్తులు విప్పుగుని, కాళ్లు చాచుకు కూర్చున్న రాక్షస రాణుల్లా, భీకరంగా వున్నాయ్. ఆ బూవి అడవి లాగ చీకటి చీకటిగా, చిక్కులు చిక్కులుగా, భయపిస్తోంది.

ఆ బూవిలో పాములు తిరుగుతుండేవి. ఎలుగు గొడ్లు విహరిస్తూ వుండేవి. తోడేళ్లు నివసిస్తూ వుండేవి.

అయినా–రావుడు భయపడలేదు.జడవలేదు.

ఆ బూవిలో పంటలు పండించాలనే పట్టుదల అతడిలో ప్రబలమయ్యింది. అతడి చేతులు గొడ్డళ్లయి, ఆ బండ రాళ్లని పిండి చేసాయ్. అతడి వూపిరి అగ్ని జ్వాలలయి, ఆ చెట్లనీ-ఆ పొదల్నీ కాల్చేసాయ్. అతడి గోళ్లు తవ్వుగోళ్లయి, చెట్ల వేళ్లను పీకేసాయ్. అతడి కళ్లల్లో మంటల్ని చూసి,ఆ ఎలుగొడ్లు పారి పోయాయ్. అతడి గుండెల్లో నిప్పులు చూసి, ఆ తోడేళ్లు చెదిరిపోయాయ్. ఆ పాములు అతడి కాళ్ల కింద పడి, నల్లుల్లా, నలిగి చచ్చాయ్.

అతడి చెవటతో ఆ బూవి తడిసి పోయి, మెత్తబడింది.

అలా ఆ బూవి సాగులోకి వచ్చింది అయితే – ఆ యజ్ఞంలో రావుడి కుటుంబం అంతా వొళ్లు మర్చి పనిచేసారు. ఆ యజ్ఞంలో రావుడి రెండో కొడుకు, పాము కుట్టి, చచ్చి పోయాడు. రావుడి పెద్ద కొడుకు, సిమ్మాద్రి, రావుల్లా పాటు పడ్డాడు.

అయితే, అలా అందరూ ఆ యజ్ఞంలో వుండిపోయారు. ఆ యజ్ఞం ఎన్నో ఏళ్లు పట్టింది. అంచాత కూలి పని కూడా చెయ్యలేక పోయారు. అంచాత, అప్పులు చేసి, బతుకుతున్నారు.

పంటలు పండాక, అప్పులు తీర్చీ వొచ్చని అనుకున్నాడు. అయితే, అప్పులు ఎలా పెరుగుతాయో, రావుడికి తెలీదు.

ఆ బూవి సాగులోకి వచ్చింది. అప్పుల భారం పెరిగి పోయి, పీక్కి వురితాడులా తగులుకొంది. ఆ తాడు బాగా బిగుసుకు పోయింది. అప్పుడు రావుడు, మరో మార్గం లేక, ఆ బూవిని సుబ్బారావుకి అమ్మేసాడు. అలా ఆ వురితాడు తప్పించుగున్నాడు.

రావుడు అప్పుడు, మళ్లీ సుబ్బారావు దగ్గర పెదపాలి కాపుగా, జీవితాన్ని ప్రారంభించాడు.

* * *

రావుడు మామిడి చెట్ల కింద సైకిలు తోస్తున్న మనవణ్ని చూస్తున్నాడు.

మనవణ్ని చూస్తున్న రావుడు, గతాన్ని తల్చు గుంటూ, కృంగి పోతున్నాడు. మనవడి భవిష్యత్తు తల్చుకుని బాధ పడుతున్నాడు.

వేడి గాలి రివ్వున వీస్తోంది. ఎర్ర ధూళి గుప్పున వీస్తోంది. ఆకాశం ఎర్రగా మండిపోతోంది. బూవి నిప్పులా కాల్తోంది.

'నువ్వేరా, సేసినావిదంతా! నువ్వేరా, సేసినావిదంతా! ' అంటూ రావుడి భార్య, గాలిలా రివ్వున వచ్చి, వేడిగా మాట్లాడుతోంది. ఆమె ఒక చేత్తో, సత్తు గిన్నెతో, గెంజి పట్టుకొచ్చి **రావుడి ముందుంచింది**. రెండో చేయి, విసురుతూ, విసురుగా, మాటాడుతోంది.

' ఈ సేత్తో నా కొడుక్కి గెంజోసి పది పంటలయి పోనాది! ఆ పొద్దా నేదు- ఈ పొద్దా నేదు- ఆడు మళ్లీ సూపవనేదు! ఆ గుంటడికి ఆడయ్యేడో తెల్దు! ఆ గుంటడ్ని సూత్తా వుంటే, నా కడుపులో మంట లెగుస్తుంది.! నా గుండెల్లో కావేసి నట్టు గుబులు గుబులు గుంటాది! నీ రోసం ముక్కలవా, ఇదంతా నువ్వే సేసినావు, రోరి! ' అని ఆమె రావుడి మీద, చేతులు విసురుతూ, అక్కసు వెళ్లబోస్తోంది.

' ఓ లత్తా, ఒల్ల కోవే! మావ బెంగడి సత్తన్నాడే! మావని పీక్కుతినీకే! నీ కొడుకు మా మంచో డంటే! ఒల్లకోవే, సిగ్గునేక!' అని అంటూ, కోడలు అత్తని రెండు చేతులూ పట్టుకుని, ఇంటికి లాక్కు పోయింది.

రావుడు ఏదో చెబుదామని ప్రయత్నించాడు. అతడి నోరు పెగల్లేదు. విషాదం గుండెల్లో గూడు కట్టుక్కూర్చుంది. లోతుకు పోయిన అతడి కళ్లు,నీళ్లతో నిండాయ్. ఆ కన్నీటి బిందువులు జారి,గుండెల మీద చెవట బిందువుల్తో కలిసి పోతున్నాయ్.

* * *

రావుడు కొడుకు, సిమ్మాద్రి ఇల్లు విడిచి వెళ్లి పోయి, పదేళ్లయింది.

ఆ రోజులు కరువు రోజులు. రావుడి కుటుంబం, తిండి గింజలు లేక పస్తులు పడుతోంది. ఆ వూళ్లో ఎక్కువ మంది బతుకులు అలాగే వున్నాయ్. ఎవళ్లకి ఎవళ్లూ ఏవీ సాయం

చేయలేరు. అప్పుడు రావుడు సుబ్బారావు ఇంటికి వెళ్లాడు. వెళ్లి వినయంగా పిల్చాడు.

సుబ్బారావు, మేడ మీద పడక గదిలోంచి రావుడి పిలుపు విన్నాడు.

అలా విని, 'అవును! ఇప్పుడు రావుడు నన్నెందుకు పిలుస్తాడు! ఈ కరువు రోజుల్లో ఎవళ్లయినా నన్నెందుకు పిలుస్తారు! డబ్బు కోసం!– – అప్పు కోసం! వీళ్ల కిచ్చిన అప్పు లింక తిరిగి రావు! ' అని సుబ్బారావు అనుకుని 'ఏదో చెప్పి రావుణ్ని తగిలెయ్' అని భార్యతో చెప్పాడు.

ఆమె చకచకా మెట్లు దిగి వచ్చింది.

'రావుడూ, ఆయన నిద్రలో వున్నారు. ఏం కావాలి?' అని ఆమె విసుగ్గా అడిగింది.

'మాం పస్తులు పడి సస్తన్నాం, ఈ కరువు దినాల్లో కుసింత మమ్మల్ని తవరు కాయాల!' అని రావుడు, అప్పు కోసం వచ్చినట్లు అతి వినయంగా విన్నవించాడు.

'రావుడూ, నిజవే! కరువు మండి పోతోంది! ఈ కరువులు ఇంత వేగంగా పోవు! ఏదో ప్రళయం వచ్చి ముంచేసే వరకూ ఈ కరువులు పోవు! డబ్బున్న వాళ్లు ఈ కరువుల్ని పోనీరు! ఈ కరువులు పోతే, లక్షాధికార్లు కోటీశ్వర్లు కాలేరు! అంచాత ఆ కరువులు పోవుగాక పోవు! అయితే, తిరిగి రాని అప్పుల్ని ఎవ్వరూ ఇవ్వరు!' అని ఆమె విసురుగా చెప్పి, కోపంగా వెళ్లిపోయింది. ఆ మాటలు విన్న రావుడి మనసు అవమానంతో భగ్గున మండిపోయింది. కోపంతో అతడి వొళ్లు జలదరించిది. ' ఈ సుబ్బిగోడు డబ్బెలా సంపాదించాడో నాకు తెల్దనుకున్నావా? ! సుబ్బిగోడు సేసిన పాపాలూ - అన్నేయాలూ - నేరాలూ - ఓడికి తెలవ్వు!' అని రావుడు చీదరించుగుని, 'మాయి ఎదవ బతుకులు!' అని కూడా అనుకుని ఇంటి వేపు తిరిగి నడిచాడు.

ఇంట్లోకి వెళ్లాడు. వెదురు బద్దల పెట్టె బయటకు తీసాడు. అందులోంచి చిక్కం సంచి తీసాడు. అందులో డబ్బుల కోసం చెయ్యి దూర్చాడు. అయితే - అందులో డబ్బుల్లేవు!

నూకాలమ్మ పండక్కి కోడి కోసం - కొంత డబ్బు కూడ బెట్టి - ఆ చిక్కం సంచీలో దాచాడు. అందులో డబ్బుల్లేక పోవడం చూసి, తెల్ల బోయి చూస్తూ, నిస్సత్తువుగా నిలబడి పోయాడు. ' మావా, ఏటి సెప్పేది! నీ కొడుకు తాగడానికి ఆ డబ్బులు గుంజుకు పోనాడు!' అని కోడలు బెదురుతూ చెప్పింది.

సిమ్మాద్రి తాగి, గుడి అరుగు మీద పడి వున్నాడు.

రావుడికి కోపంతో వొళ్లు తెలీలేదు. కోపంతో కంపించి పోతూ, చేపాటి కర్రతో సిమ్మాద్రిని బాదాడు.

సిమ్మాద్రి ముక్కు, నేలకు ఢీకొని రక్తం కారింది. నాలుక పళ్ల మధ్య పడి, రక్తం కారింది. నుదురు చిదిగి, బొడిపి కట్టి, రక్తం చిమ్మింది. ఆ రక్తం బిందువులు ఆ గుడి అరుగు మీద ఎర్రగా మెరుస్తున్నాయ్. అవి వెంటనే ఇంకి పోలేదు.

ఆ రక్తం బిందువుల్ని చూసిన రావుడి కళ్లు నీళ్లతో నిండి పోయాయ్.

'నా నొట్టి పసువిని! గొడ్డును బాదినట్టు నా కొడుకుని బాదాను! దరిద్దెరాన్ని బాదనేక నా కొడుకని బాదాను!' అని రావుడు తల్లడిల్లి పోయాడు.

అప్పుడు సిమ్మాద్రి,తుండు గుడ్డతో రక్తాన్ని తుడుచు గుని,పరుగెత్తి పారి పోయాడు.

కొడుకు వూరు విడిచి పారి పోయాడని తెల్సుగున్న రావుడు కుప్పలా కూలి పోయాడు.

* * *

ఆ పత్ర బూవి ఆ కుటుంబం రక్తం తాగింది. సిమ్మాద్రి జవ పీల్చేసింది. సిమ్మాద్రి తమ్ముడి ప్రాణం తినేసింది.

అయితే - బంగారం పడుతుందని ఆశించిన ఆ బూవి అప్పులు తినేసాయ్.

సిమ్మాద్రికి జీవితం అంతా చీకటిగా, నల్ల త్రాచులా, నిరాశగా,శిక్షగా మారిపోయింది.

ఆ దెబ్బకు అతడు తట్టుకోలేక విలవిల తన్నుకుంటూ, పీకల వరకూ నిరాశలో కూరుకుపోయాడు.

తాగుడు తప్ప మరో వూరట సిమ్మాద్రికి దొరక లేదు! తాగుడే జీవితంలా- జీవితాన్ని గడుపుతున్నాడు.

* * *

ఆ గుడి అరుగు మీద రక్త బిందువులు రాల్చిన సిమ్మాద్రి, ఎవరికీ చెప్పకుండా, వూరు విడిచి వెళ్లి పోయాడు. అలా వెళ్లి పోయి, చాలా దూరంగా వున్న పట్నం చేరుకున్నాడు.

ఆ పట్నంలో మొట్ట మొదట ఓ కట్టెల వ్యాపారి దగ్గర కూలీగా చేరాడు. ఆ తర్వాత ఓ సిమెంటు వ్యాపారి దగ్గర పని చేసాడు. ఆ తర్వాత అతడు అలా అలా చాలా చోట్ల, చాలా మంది దగ్గర చాలా చాలా పనులు చేసాడు. ఎక్కడ పని చేసినా, వొళ్లు వంచి, కష్టపడి పని చేసాడు. నమ్మ దగ్గ మనిషిగా పేరు సంపాదించాడు.

తాగుడు మానేసాడు. చుట్టలకు బదులు బీడీలు కాలుస్తున్నాడు. గెంజి నీళ్లకి బదులు టీలు తాగుతున్నాడు.

అతడి జుత్తు, ఆడవాళ్ల జుత్తులా పొడవుగా వుండేది . అతడు ఆ జుత్తును సిగలా ముడి చుట్టుకునేవాడు.అయితే, పట్నంలో పనులకి ఆ జుత్తు ఇబ్బందిగా వుండేది. అంతే గాకుండా, తోటి పని వాళ్లకి ఎవరికీ అంత పొడవు జుత్తు లేదు. అంచాత, సిమెంటు వ్యాపారి దగ్గర పనిచేస్తున్నప్పుడు, జుత్తు పొట్టిగా చేయించి, క్రాపు చేయించాడు. ఎర్ర బనీన్లు వాడడం మెదలెట్టాడు. అంతే గాకుండా, హవాయి చెప్పులు వాడుతున్నాడు. అప్పుడప్పుడు, అన్నానికి బదులు, ఇడ్లీలు రొట్టె ముక్కలూ తింటున్నాడు.

పంచెకు బదులు, ఎర్ర లాగు తొడుక్కోమని తోటి కూలీలు చెప్పినా, వినలేదు.

తాటి తడపల మంచానికి బదులుగా, గోనె సంచుల మీద పడుక్కుంటున్నాడు.

డబ్బు కూడ బెట్టి, ఆ డబ్బుతో ఇంటికి వెళ్లాలని పట్టుదలతో బతుకు తున్నాడు.

అతడు నిద్రలో వున్నప్పుడు – –

తండ్రి ఆవేదన వినేవాడు.

తల్లి ఏడ్పులు ఆలకించేవాడు.

కడుపుతో వున్న భార్య పిలుపులు వినేవాడు.

అతడు నిద్ర రాని రాత్రి వేళల్లో– –

ఆ గుడి అరుగుల పిలుపులు వినేవాడు.

ఆ వేపచెట్టు ఆకుల రాగాలాపాన్ని వినేవాడు.

చీకటి పులిలా, సుబ్బారావుని చూసేవాడు

అలా సిమ్మాద్రి పట్నంలో జీవితాన్ని గడుపుతున్నాడు.

* * *

అది వెన్నెల రాత్రి. అతడు రావి చెట్టు కింద బస్తాలు లాగే బండి మీద వెల్ల కిలా పడుక్కున్నాడు. చల్ల గాలి వొళ్లు పులకరించేలా వీస్తోంది.

అతడు భార్యకి దూరంగా వుండడం వల్ల, ఆ వెన్నెల్ని కోప్పడ్డాడు. ఆ చల్ల గాల్ని తిట్టాడు. తల్లి దండ్రులకీ, భార్యకీ, పిల్లడికీ, - తన వూరికీ దూరంగా వుండడం వల్ల, ఆకాశం విరిగి మీద పడిపోతున్నట్లు, నిరాశగా వున్నాడు.

ఆ పక్కింటి గోడ మీద చిక్కగా అల్లుకుని, పచ్చగా లతలున్నాయ్. ఆ లతల్లో తెల్లని సన్నజాలున్నాయ్

సిమ్మాద్రి ఆ లతల్ని పిడికిలితో పీకి నలిపి పారేసాడు.

ఆ సన్నజాజుల్ని పిడికిలితో పీకి, కాలి కింద వేసి, నలిసేసాడు.

'సిమ్మాద్రీ – – సిమ్మాద్రీ - - , ఓ గావుకేక విన్నాడు. సిమ్మాద్రి తుల్లి పడ్డాడు. అది అతడి గుండె వేసిన కేక! 'ఏయిరా డబ్బు సంచులు;! - - ఎక్కడెట్టినావ్రా; - - నువు వూరొగ్గేసి పది పంటలయి పోనాదిరా! - - నువు తాగుడు మానేసి నావే! కడుపు కట్టు గుని బతుకుతున్నావే! ఒల్లు దాసుకోకుండా పని సేస్తన్నావే! మరేయిరా, నువు పోగేసిన డబ్బు సంచులు! – –'

'ఏటీ, ఏటీ; ! – – డబ్బు సంచులా;! – – డబ్బు సంచులా! – – నా సేతులో సిల్లు కానీ కూడా నేదు!!' సిమ్మాద్రి నిరాశగా, విషాదంగా, దుఃఖంగా, పిచ్చిగా, అరిచాడు.

అలా అరుస్తూ, అరుస్తూ పిచ్చి పిచ్చిగా అరుస్తూ, పిచ్చి పిచ్చిగా చూస్తున్నాడు. అప్పుడొక ఎలక చల్లగాలి కోసం,గోడ కన్నం లోంచి బయటకు వచ్చింది. ఆ ఎలక యవ్వనంగా, బలంగా

వుంది.ఆ చల్లగాల్లో, ఆ లతల్లో, ఆ సన్నజాజుల్లో, బుల్లి బుల్లి గంతులు వేస్తూ, స్వేచ్ఛగా తిరుగుతోంది.

హఠాత్తుగా గోడ మీంచి ఒక పిల్లి వచ్చింది. హఠాత్తుగా ఒక్క దూకు దూకి, ఎలకను నోట్లితో కర్చుకుని, పట్టుకుంది.

సిమ్మాద్రి అది చూసాడు. వెంటనే పక్కనున్న ఇటిక బెడ్డను పిల్లి మీదికి విసిరాడు. ఆ ఎలకను వదిలేసి, పిల్లి పారిపోయింది. సిమ్మాద్రి, వెల్లకిలా ఆ బండి మీద మళ్లీ వాలి, ఆకాశంలోకి చూస్తూ, ఆ రాత్రి గడిపాడు.

తెల్ల వారింది. అతడు వెంటనే తన వూరికి బయలు దేరాడు.

* * *

ఎండ మండి మండి, మళ్లు ముఖం పట్టింది. చెట్ల ఆకులు వాడివాడి మొహాలు వెలేసాయ్. గాలి వీచి వీచి, మందగించింది. ఎర్ర ధూళి ఎగిరి ఎగిరి, మరింక ఎగర లేదు.

రావుడు చుట్ట కాల్చి కాల్చి, మిగిలిన చుట్ట ముక్క, తల పాగాలో దాచాడు.

ఆడుకుంటున్న మనవణ్ని చూస్తూ చూస్తూ సిమ్మాద్రిని తల్చుగుంటున్నాడు. సిమ్మాద్రిని తల్చు గుంటూ, తల్చు గుంటూ, నిరాశలో కూరుకుపోతున్నాడు.

'నిన్ను పొద్దుట కాణ్నుంచీ సైకిలు మీద కూకో బెట్టి తోత్తన్నానే, నన్నోపాలి కూకోనీవా;' రామారావు అడిగాడు.

'వీల్లేదు.' అన్నాడు గిరిజారావు

'ఓరి ఎర్రోడా! ఆడు నిన్ను కూకోనీడ్రా! ఏసెట్టు ఆ సెట్టు కాయలే కాద్దిరా!' అని అనుకున్నాడు రావుడు.

రామారావు మనసు విసవిస లాడింది. కొంత సేపు విచారంగా, దీనంగా మామిడి చెట్టు కొమ్మమీద కూర్చున్నాడు.

మరి కొంత సేపటికి మళ్లీ సైకిలు తోయడం మొదలెట్టాడు.

* * *

అంతలో సిమ్మాద్రి వూరు చేరుకున్నాడు.

వూరు వూరంతా సిమ్మాద్రిని వుత్సాహంగా, ఆనందంగా పిలిచింది. కౌగిట్లోకి తీసుగుంది. ఆనంద బాష్పాలు రాల్చింది.

సిమ్మాద్రి ఆత్రుతగా వచ్చి, వేప చెట్టు మొదల్ని నడుం ఆన్చి కూర్చున్న తండ్రి ముందు నిలబడ్డాడు.

'ఓరి చిమ్మాద్రి! ఒచ్చినావట్రా ! నాన్జేసిన తప్పుకి తగిన సిచ్చ ఏసినావు! ఈ ముసలి

పేణం రాలి పొయ్యేముందైనా నిను సూసినాను! ఇదే సాలు ఈ బతుక్కి!' అని కొడుకుని సందిట్లోకి తీసుగుని మురిసిపోయాడు రావుడు.

తండ్రి వచ్చాడని తెల్సుగున్న రామారావు గంతులు వేసు గుంటూ వచ్చాడు.

సిమ్మాద్రి కొడుకుని ఎత్తుగుని, ముద్దాడి, భుజం మీద ఎక్కించి కూర్చోబెట్టుగున్నాడు. సంతోషంతో పరవశించి పోయాడు.

అంతలో సిమ్మాద్రి తల్లి, సత్తు గిన్నెలో గంజీ, అన్నం పట్టుకొచ్చింది.

'ఈ సేత్తో నీకు గంజోసి పది పంటలయపోనాది రోరి కొడకా! ఇదంతా మీయయ్యే సేసినాడ్రోరి కొడకా!' అని ఆమె కొడుకుని దగ్గరాగా తీసుగుని, తల నిమిరింది. కన్నీరు కార్చింది.

సిమ్మాద్రి కన్నీరు కారుస్తూ, ఆమెను వూరడించాడు.

'ఇన్నాళ్లకి మాం గురుతొచ్చినా వన్నమాట! మాం ఏ వయిపోనావో తలపే నేదన్న మాట!' అని అతడి భార్య జలజలా కన్నీరు కార్చింది. సిమ్మాద్రి తల్లి ఆమెను మందలిస్తూ ఇంటికి తీసుకు వెళ్లింది.

వూరు వూరంతా అతడి చుట్టూ చేరింది. వూరు వూరంతా సందడిగా పండగలా వుంది.

* * *

రామారావు మళ్లీ తోట్లోకి పరుగెత్తుకు పోయి గిరిజారావు కూర్చున్న సైకిలు తోస్తున్నాడు.

ఆ తర్వాత గిరిజారావు సైకిలు దిగి మీడమీదకు పరుగెత్తాడు . రామారావు మావిడి చెట్టు కింద కాళ్లు చాచుక్కూర్చున్నాడు.

'అల బొద్దు కాణ్ణుంచీ ఆణ్ని సైకిలు మీద కూకో బెట్టి తోత్తన్నా, నన్నోపాలి కూకోనిచ్చి నాడు కాడే!' అని రామారావు నిరాశగా, కోపంగా వున్నాడు.

అంతలో గిరిజారావు, వెండి కంచంలో పనస తొనలు తెచ్చుగుని, రామారావు ముందు నిలబడి తింటున్నాడు. ఆ పనస తొనలు పనసతొనలవాసన వేస్తూ, పసుపు పచ్చగా, బింకంగా, రసవంతంగా వుండి, నోరూరిస్తున్నాయ్.

'నాకో తొనెట్టవా?' రామారావు అడిగాడు. ఇవ్వనని తల అడ్డంగా తిప్పుతూ చెప్పాడు గిరిజారావు.

'సైకిలు మీద గూకోనిచ్చినావు గాదే?! ఒకతొనేనా ఎట్టు.?' అని రామారావు, గిరిజా రావుకి దగ్గరగా వెళ్లి అడిగాడు. ఇవ్వనని గిరిజారావు గట్టిగా అరిచాడు.

'ఎందుకివ్వవు: అలబొద్దు కాణ్ణుంచి సైకిలు తోత్తన్నానే! సైకిలు మీద గూకోనిచ్చినావు గాదే! తొన కూడా ఎట్టవా;!' అని రామారావు మరి కొంచెం దగ్గరగా వెళ్లి, మరి కొంచెం గట్టిగా అడిగాడు.

'ఇవ్వను! ఇవ్వను! ఇవ్వను!' అని గిరిజారావు గర్జించాడు

'నీకు నాయం నేదు! ఒక తొన గుడా ఎట్టనంటన్నావు! మరి సూసుకో!' అని ఆ వెండి కంచంలోని తొనల్ని లాక్కున్నాడు.

గిరిజారావు ముందుకు వస్తే, తోసేసి, ఆ తొనల్ని గర్వంగా తింటున్నాడు.

* * *

సిమ్మాద్రే గాకుండా, రావుడూ, అంతే గాకుండా అక్కడ చేరిన వారందరూ ఆ జరిగిందంతా చూసారు.

'ఓరి గుంటడా! ఏట్రా నువు సేసినావు; ఏట్రా ఆ దగుల్బాజీ పని? కూడ్నేపోతే నువు ఆకల్తో సావు! నువు సస్తే ఈ నోకానికి ఏటీ సష్టం నేదు! ఏటీ లోటు రాదు! కానీ నీతి సావగూడదు! నీతి సస్తే నోకం నచ్చినట్టే! ఏట్రా నీ పొగరు! నీతి మాలిన పని సేస్తావట్రా! సూడు, ఇయ్యాల నీ దుమ్ము లిరుగుతాయ్!' అని రావుడు చేతిలోని చేపాటి కర్ర పై కెత్తాడు.

'ఓరి తాతా! నా దుమ్ము లిరుగుతాయట్రా! నానేం తప్పు సేసినాన్రా! ఆ తప్పంతా ఆ మెకం గోడు, ఆడిదేరా! నాను సేసింది నీ కంటికి ఆనిందా?! ఆడు సేసింది నీ కంటికి ఆన్నేదా?! రారా,కొట్రా!' అని రామారావు తాత చేతి లోని కర్రను ఎగిరి పట్టుగుని, బలంగా లాగాడు. రావుడు కర్ర వదల్లేదు గానీ, కుదుపుకి తూలి పడిపోయాడు.

వొళ్లు తెలీని కోపంతో, కర్ర నానుకుని లేచి,మనవణ్ని కొట్ట డానికి మళ్లీ కర్ర పైకెత్తాడు.

'ఓరయ్యా, ఓరోరయ్యా! ఆగరా, ఆగరా! ఒల్లకోరా, ఒల్లకోరా! నీకు ఆకలి బాదే గాని అన్నేయాల బాద తెల్నేదురా! నీకు కడుపు మంటే గానీ, గుండె మంట తెల్దురా! నీ మనవడు, నీ నాగా, నా నాగ బతకనేడ్రా!' అంటూ సిమ్మాద్రి తండ్రిని అడ్డుకున్నాడు.

తెల తెల బోతూ రావుడు వెర్రి వెర్రిగా చూసాడు.

అక్కడ చేరిన వాళ్లందరూ, తెల తెల బోదూ మౌనంగా వుండి పోయారు.

* * *

సుబ్బారావు, మనవడి ఏడ్పు విన్నాడు. గబ గబా మెట్లు దిగి కిందకి వచ్చాడు. మనవడి ద్వారా జరిగింది తెల్సుగున్నాడు.

'ఎవడ్రా వాడు, నా మనవణ్ని కొట్టాడు?! ఎవడ్రా వాడు, నా మనవణ్ని కిందకి తోసేసాడు?! నా మనవడి వంటి మీద చేయి వేయడానికి వాడికి ఎన్ని వేల గుండెలున్నాయ్‌రా?! వాణ్ని ముక్కలు ముక్కలు కింద తరిగించేసి, గెద్దలకు ఎగరేయిస్తా?! ఎవడ్రా వాడు?! అని సుబ్బరావు గావు కేకలు పెట్టి, జనాన్ని చూసి మనవణ్ని తీసుగుని, మేడ మెట్లు ఎక్కాడు.

* * *

(సృజన - మాస పత్రిక - ఏప్రిల్, 1974)